క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వేంకటాద్రి పై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. స్వామివారికి విశేష పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సింహగిరిపై నిత్యకల్యాణం పునరుద్ధరణ



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి నిత్యకల్యాణాన్ని శుక్రవారం నుంచి పునరుద్ధరించారు. గడచిన 15 రోజులుగా ఆలయంలో అధ్యయనోత్సవాలు, ముక్కోటి ఏకాదశి తదితర ఉత్సవాలను పురస్కరించుకుని నిత్యకల్యాణాన్ని నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా తిరిగి నిత్యకల్యాణం పునరుద్ధరించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై ఆశీనులను చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

నేడు సతివాడమ్మ పరస



పెందుర్తి: గొరపల్లిలో కొలువైన ఏడు గ్రామాల ఇలవేల్పు సతివాడమ్మ తల్లి పరస శనివారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం తప్పెటగుళ్లు, కోలాటాలు, భజనలు ఉంటాయని చెప్పారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

నేడు నాయుడుపాలెంలో ఉచిత వైద్య శిబిరం

పరవాడ: మండలంలో నాయుడుపాలెం వినాయక ఆలయం వద్ద సీసీడీసీ ఎన్జీవో ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని మాజీ ఎంపీటీసీ సభ్యుడు కూండ్రపు శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. స్టార్ హెల్త్ సీఎస్సార్ ఆర్థిక సహకారంతో జరిగే ఈ వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులతో హెచ్‌బీ, ఆర్‌బీఎస్, ఈసీజీ టెస్టులు ఉచితంగా నిర్వహిస్తారు అన్నారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నాయుడుపాలెం, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న అప్పలనాయుడు తదితరులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సబ్బవరంలోని గోపాల్‌నగర్‌కు చెందిన సింగంపల్లి అప్పలనాయుడు (బుజ్జి) శుక్రవారం రూ.25,116 విరాళంగా అందజేశారు. నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద ఈ విరాళం మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. దాత సింగంపల్లి అప్పలనాయుడికి ఆలయ కమిటీ సభ్యులు దంగేటి నాని, గెద్దం కృష్ణ, బర్ల రమణ, ముర్రి కనకరాజు, కోరాడ శ్రీను తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

కొండలు, ప్రభుత్వ స్థలాల్లో రాత్రిపూట తవ్వకాలు.. తరలింపు

భారీ వాహనాల వినియోగం

గంటల వ్యవధిలోనే ఫిల్లింగ్ పూర్తి చేస్తున్న అక్రమార్కులు

చోద్యం చూస్తున్న అధికారులు



గ్రావెల్ తరలించుకుపోతున్న సూర్రెడ్డిపాలెం సమీపంలోని రింగ్ రోడ్డు



వెదుళ్లనరవలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్

యథేచ్ఛగా.. గ్రావెల్ దందా

సబ్బవరం: మండలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జీవీఎంసీ పరిధిలోని గంగవరం, వెదుళ్లనరవతో పాటు పలు గ్రామాల్లోని కొండవాలు ప్రాంతాలు, ప్రభుత్వ భూములను సైతం విడిచిపెట్టడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. చుట్టు పక్కల ప్రాంతాల్లోని లే అవుట్లు, ల్యాండ్ ఫిల్లింగ్, గృహ నిర్మాణాలకు గ్రావెల్ తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. గంగవరం, వెదుళ్లనరవ, అజనగిరి ప్రాంతాలను ఆనుకుని గత ప్రభుత్వం వైఎస్సార్ అర్బన్ హౌసింగ్ లే అవుట్లు వేసింది. ఆయా లేఅవుట్లను ఆనుకుని ఉన్న కొండవాలు ప్రాంతాలతో పాటు లే అవుట్లలో ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో పొక్లెయిన్లతో తవ్వి రాత్రి పూట గ్రావెల్ తరలిస్తున్నారు.

పలు చోట్ల స్టాక్ పాయింట్లు..

జీవీఎంసీ పరిధిలోని సంధ్యానగర్ కాలనీ, వెదుళ్లనరవ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు, ప్రైవేట్ లే అవుట్లు, ఖాళీ ప్రదేశాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి గ్రావెల్‌ను నిల్వ చేస్తున్నారు. డిమాండ్ మేరకు పగలు సమీపంలోని గాజువాక, దువ్వాడ, లంకెలపాలెం, స్టీల్‌ప్లాంట్, కూర్మన్నపాలెం తదితర ప్రాంతాల లే అవుట్ల అభివృద్ధికి, ల్యాండ్ ఫిల్లింగ్‌కు, గృహ నిర్మాణాలకు తరలిస్తూ రూ. లక్షలు కొల్లగొడుతున్నారు. డిమాండ్ మేరకు ఒక్కో డంపర్ రూ.6 వేల నుండి రూ.8 వేల వరకూ విక్రయిస్తున్నారు.

భారీ యంత్రాల వినియోగం..

గ్రావెల్ తవ్వకాలు, తరలింపునకు భారీ యంత్రాలు, పొక్లెయిన్లు, డంపర్లు వినియోగించడంతో **గంటల వ్యవధిలోనే** ఫిల్లింగ్ పూర్తి అయిపోతోంది. **గ్రావెల్ తరలించేందు**కు డంపర్లను వినియోగించ**డంతో తవ్వే చోట, ఫి**ల్లింగ్ చేసే ప్రదేశంలో తప్ప **తరలింపు జరిగే రోడ్డు** మార్గంలో ఎక్కడా వాటి ఆన**వాళ్లు కనిపించడం లే**దు. దీంతో రెవెన్యూ, మైనిం**గ్, పోలీస్ అధికా**రులకు వీరిని గుర్తించడం **సవాలుగా మారుతో**ంది. అధికారులకు స్థానికులు **ఫిర్యాదు చేస్తున్నా** గ్రావెల్ అక్రమ తవ్వకాలు **ఆగడం లేదు. నామ** మాత్రపు పెనాల్టీ విధించి **వాహనాలు విడిచిపెడు**తున్నారనే ఆరోపణలు విని**పిస్తున్నాయి. ఇప్పటికై**నా గ్రావెల్ అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే అసహనం..

ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఆగడం లేదని ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని అధికారుల తీరుపై ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అసహనం వ్యక్తం చేశారు. గ్రావెల్ అక్రమ తవ్వకాల విషయాన్ని పలువురు తన దృష్టికి తీసుకు రావడంతో అధికారులకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల మండలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలను కట్టడి చేసేందుకు మండల స్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. తహసీల్దార్‌తో పాటు మైనింగ్, పోలీస్ అధికారులు కమిటీ సభ్యులుగా ఏర్పడి.. సమావేశం నిర్వహించారు. అయినప్పటికీ మండలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నట్లు కనింపించడం లేదు.

గ్రావెల్ క్వారీలకు అనుమతి లేదు..



మండలంలో గ్రావెల్ క్వారీలకు ఎక్కడా అనుమతి లేదు. గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. జీవీఎంసీ పరిధిలోని గంగవరం, వెదుళ్లనరవ, పైడివాడ, పైడివాడ అగ్రహారం, అసకపల్లి, ఎల్లుప్పి వంటి ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆయా ప్రాంతాలను పరిశీలించి గ్రావెల్ అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– బి. చిన్నికృష్ణ, తహసీల్దార్, సబ్బవరం మండలం

సంపూర్ణ అక్షరాస్యత ప్రతి ఒక్కరి బాధ్యత



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

సబ్బవరం: నిరక్షరాస్యులైన వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అనకాపల్లి జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. శచీదేవి పిలుపునిచ్చారు. సబ్బవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమంపై జిల్లాస్థాయిలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎంపీడీవోలు, వెలుగు ఏపీఎంలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రాష్ట్ర ఇన్‌చార్జి విశ్వనాథ్ శ్రీనివాస్ మాట్లాడుతూ అక్షరాస్యత కార్యక్రమాల్లో సాంకేతిక పరిజ్ఞానం ఆవశ్యకతను వివరిస్తూ టాటా కన్సల్టెన్సీ దేశ వ్యాప్తంగా అక్షరాస్యతా పెరుగుదలకు చేస్తున్న కృషిని వివరించారు. అదే విధంగా వాలంటరీ టీచర్లను ఆ దిశగా సాంకేతికంగా అభివృద్ధి చేయాలని కోరారు. వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు ఎస్ఎస్ వర్మ మాట్లాడుతూ అక్షరాస్యత అవసరం, ప్రయోజనాలను వివరించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి ఎస్. మంజుల వాణి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. వయోజన విద్య అనకాపల్లి నోడల్ ఆఫీసర్ డి. చిన్నికృష్ణ శిక్షణాంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ కె. శ్రీనివాస్, వివిధ మండలాల ఎంపీడీవోలు, డీఆర్‌డీఏ ఏపీఎంలు పాల్గొన్నారు.

అందరి క్షేమానికే ట్రాఫిక్ నిబంధనలు



సదస్సులో ప్రసంగిస్తున్న సీఐ మల్లికార్జునరావు



రోడ్డు భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్, ఎంవీఐలు, గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ తదితరులు

పరవాడ: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. విశాఖ జేఎన్ ఫార్మాసిటీలోని కమర్షియల్ హబ్‌లో శుక్రవారం 36వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు అవగాహన సదస్సులో సీఐ ప్రసంగించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే ప్రాణాలకు రక్షణ ఉండదన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. భారీ వాహనాలు నడిపే వారు సీటు బెల్ట్ విధిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, వాహనాలను మితిమీరిన వేగంతో నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే తీసుకునే చట్టపరమైన చర్యల గురించి క్షుణ్ణంగా వివరించారు. సైబర్ క్రైం అధికమవుతున్న తరుణంలో దానిపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఫార్మాసిటీ యాజమాన్యానికి సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించిన ఫార్మాసిటీ యాజమాన్యానికి పోలీసు శాఖ తరపున సీఐ మల్లికార్జునరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సదస్సులో ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌రావు భక్షి, రాఘవరెడ్డి, మోహన్, శ్రీనాథరెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో..

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు మాధవి, భారతి ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు పలు సూచనలు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దృష్టి రహదారిపై ఉండాలని తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం నేరమని తెలిపారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ లేకుండా వాహనం నడపకూడదని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గోపాలపట్నం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో ఏటా లక్షా 50 వేల మంది వాహన ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు నడిపేటప్పుడు ప్రతి డ్రైవర్ ఏకాగ్రతతో ఉండాలన్నారు. ఇంటి సమస్యలు ఇంటి వరకే పరిమితం చేసుకోవాలన్నారు. ఒక డ్రైవర్‌పై 50 నుంచి 60 మంది ప్రయాణికుల ప్రాణాలు ఆధారపడి ఉంటాయని తెలిపారు. డిపో మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ జీరో యాక్సిడెంట్లను కలిగి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డిపో సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా డొంకమాంబ, సీతారాముల తీర్థాలు



డొంకమాంబ పేరంటాలమ్మను దర్శించుకుంటున్న నారాయణమూర్తి తదితరులు

సబ్బవరం: మండలంలోని రావాలమ్మపాలెం గ్రామంలోని డొంకమాంబ పేరంటాలమ్మ అమ్మవారి తీర్థం, అసకపల్లి గ్రామంలోని సీతారాముల వారి తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు పేరంటాల అమ్మవారిని, సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రావాలమ్మపాలెంలోని డొంకమాంబ పేరంటాలమ్మను దర్శించుకున్న వారిలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, గొంప ముత్యాలనాయుడు తదితరులు ఉన్నారు. అదే విధంగా అసకపల్లిలోని సీతారాములను సర్పంచ్ కర్రి నర్సింగరావు, కర్రి శ్రీను, కర్రి కనకరాజు తదితరులు దర్శించుకున్నారు.

కాలుష్య నివారణతోనే మెరుగైన జీవితం



మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్న జనవిజ్ఞాన వేదిక బృందం సభ్యులు

పరవాడ: ఫార్మాసిటీ కాలుష్యంతో దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న తాడి గ్రామస్తుల జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి ప్రభుత్వం తక్షణమే కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని జనవిజ్ఞాన వేదిక అనకాపల్లి బృందం నాయకుడు కె.త్రిమూర్తులురెడ్డి డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో చేపట్టిన పర్యావరణ అవగాహన యాత్రలో భాగంగా శుక్రవారం ఫార్మాసిటీ కాలుష్యంలో చిక్కుకున్న తాడి, చినతాడి, పెదతాడి, తానాం గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వేదిక తెలుసుకుంది. ఫార్మా పరిశ్రమల కారణంగా గాలి, నీరు, భూగర్భ జలాలు పూర్తి స్థాయిలో కలుషితం అయిపోయాయని, విధి లేని పరిస్థితుల్లో తాడి గ్రామంలో నివసిస్తున్నామని అక్కడి ప్రజలు వాపోయారని తెలిపారు. గర్భం దాల్చిన మహిళలు గ్రామంలో ఉండడానికి భయపడుతున్నారని, చిన్నా పెద్ద తేడా లేకుండా శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధిత జబ్బులు, చర్మ వ్యాధులు, ముడుకుల నొప్పులతో బాధపడుతున్నారన్నారు. కాలుష్యం బారిన పడిన మూగ జీవాలకు పునరోత్పత్తి జరగడం లేదన్నారు. పంటలు పూర్తిగా మానుకున్నామని, పండగలు పబ్బాలకు వచ్చిన ఆడ పిల్లలు పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వాసనకు ఉండడానికి ఇష్టపడడం లేదని ప్రజలు బృందం వద్ద మొరపెట్టుకున్నారని త్రిమూర్తులు రెడ్డి తెలిపారు. ఈ బృందంలో మారిశెట్టి వెంకటప్పారావు, బి.రామ్‌కుమార్, బి.ఉమామహేశ్వర రావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఉన్నారు.

యోగానంద నారసింహునిగా అప్పన్న



యోగానంద నారసింహుని అలంకారంలో లక్ష్మీనృసింహస్వామి



తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శుక్రవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి యోగానంద నారసింహ స్వామి అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని యోగానంద నారసింహుడిగా అలంకరించి పల్లకిలో ఆశీనులను చేశారు. ఆళ్వారులను వేరొక పల్లకిలో ఉంచి సాయంత్రం సింహగిరి మాడ వీధిల్లో వైభవంగా తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. తిరువీధిలో స్వామిని భక్తులు దర్శించుకుని ఆశీస్సులు పొందారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

20 నుంచి గుల్లేపల్లిలో రీసర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి రెవెన్యూ గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుండి రీ సర్వే కార్యక్రమం నిర్వహించనున్నట్లు సబ్బవరం తహసీల్దార్ బి. చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం రీ సర్వేపై గ్రామంలో అవగాహన ర్యాలీ, గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. గుల్లేపల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 1681 ఎకరాల విస్తీర్ణంలో భూమి ఉండటంతో రీ సర్వేకు సౌలభ్యంగా ఉండే విధంగా 6 బ్లాక్‌లుగా విభజించి ఒక్కో బ్లాక్‌కు ఒక టీమ్‌ను కేటాయించినట్లు తెలిపారు. ఒక్కో టీమ్‌లో ఇద్దరు విలేజ్ సర్వేయర్లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏ ఉంటారన్నారు. వారికి కొన్ని సర్వే నంబర్లు, 250 నుండి 300 ఎకరాల వరకూ సర్వేకు కేటాయిస్తామన్నారు. గత రీసర్వేలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఎర్రర్ ఫ్రీ రికార్డును తయారు చేసేందుకు నియమించిన కమ్యూనికేషన్ టీం కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ టీం గ్రామంలోని ప్రతి భూ యజమాని రీ సర్వే జరిగే ప్రదేశానికి వచ్చే విధంగా చర్యలు చేపడుతుందన్నారు. రైతులంతా సంబంధిత హక్కు పత్రాలను అందజేసి సరైన రికార్డులు తయారు చేసేందుకు రెవెన్యూ యంత్రాంగానికి సహకరించి ఈ రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీసర్వే కార్యక్రమాన్ని 120 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ గణపతి రావు, మండల సర్వేయర్ లాలం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉజ్జీవ ఆశీర్వాద సభలు



ప్రసంగిస్తున్న పి.జె.స్టీఫెన్ పాల్

సీతంపేట: పీజే స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ పి.జె.స్టీఫెన్‌పాల్, సిస్టర్ శైలాపాల్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఉజ్జీవ ఆశీర్వాద సభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుని ప్రేమ వర్షంలో మనం ఉంటే, ఈ లోకంలో ఉన్న ప్రతీ శ్రమను జయించి దేవుడిని ప్రత్యేక్షంగా చూడగలమన్నారు. విశాఖ, వరంగల్, బెంగళూరు, ఖమ్మం, హైదరాబాదు, తూర్పు పశ్చిమ గోదావరి ప్రాంతల నుంచి ప్రజలు వేలాదిగా సభకు హాజరయ్యారు. శని, ఆదివారాలలో కూడా సభలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు రెండు ప్రాంతాల్లో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్-స్వచ్ఛ విశాఖ' కార్యక్రమం

విశాఖ సిటీ: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రతి నెల 3వ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్-స్వచ్ఛ విశాఖ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం(18వ తేదీ) ఉదయం 10 గంటలకు సెంట్రల్ పార్క్ వద్ద, అనంతరం 11.30 గంటలకు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా తన పరిసరాలతో పాటు కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనవసరమైన కాగితాలను తొలగించాలని తెలిపారు. సంస్థ నిర్వహణలో ఉన్న అన్ని పార్క్‌లలో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, అదేవిధంగా వీఎంఆర్‌డీఏ పరిధిలోని వాణిజ్య సముదాయాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని శత శాతం నిషేధించాలని ఆదేశించారు. తప్పని సరిగా వస్త్ర లేదా కాగితపు సంచులను మాత్రమే ఉపయోగించాలన్నారు. విధిగా పొడి చెత్త, తడి చెత్తలకే వేర్వేరుగా చెత్త బుట్టలను వినియోగించాలని సూచించారు.

సెయిల్‌లో విలీనంతోనే స్టీల్‌ప్లాంట్ భవిత



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న గాజువాక జోన్ సీపీఎం కార్యదర్శి రాంబాబు, మాజీ కార్పొరేటర్ ఈశ్వరమ్మ తదితరులు

సీతమ్మధార: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పూర్తిగా మనుగడ సాధించాలంటే సెయిల్‌లో విలీనం చేయాలని గాజువాక జోన్ సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు,మాజీ కార్పొరేటర్ బొట్ట ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 1,389 రోజు కొనసాగింది. ఈసందర్భంగా రాంబాబు, ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఆర్థిక ప్యాకేజీ స్టీల్ ప్లాంట్ కొంతమేర ఆర్థిక సమస్యల నుంచి బయటపడడానికి తాత్కాలిక ఉపశమనంగా ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీ శాశ్వతమైన పరిష్కారం కాదని వారు చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే, సొంత గనులు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ బలమైన సంస్థగా ఎదుగుతుందని చెప్పారు. దీనిపైన కూడా కేంద్రం ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదన్నారు. ఆర్థిక ప్యాకేజీ ఏ రూపంలో ఇస్తున్నారో స్పష్టం చేయలేదని తెలిపారు. పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమించాలని.. అవసరమైన వసతులు కల్పించి పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధించడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. రిలేనిరాహార దీక్షలో గొలగాని అప్పారావు, ఎ. నూకేశ్వర రావు, భానుమూర్తి, ఆనంద్ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న మళ్ల విజయప్రసాద్ దంపతులు

మల్కాపురం: రిపబ్లిక్ డే సందర్భంగా 60వ వార్డు కార్పొరేటర్, పి.వి.ఎస్.హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి డాక్టర్ పి.వి.సురేష్ ఆధ్వర్యంలో ఈ నెల 26న 60వ వార్డు గుల్లలపాలెం, వాకింగ్ పార్కు సమీపంలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ కోరారు. రక్తదానం శిబిరానికి సంబంధించిన పోస్టర్,కరపత్రాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. స్థానిక క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మళ్ల ప్రసాద్ మాట్లాడుతూ తన ట్రస్టు ద్వారా నగర నలుమూలలకు చెందిన పలువురు నిరుపేదలకు సేవా కార్యక్రమాలను అందించి సురేష్ ఆదర్శంగా నిలిచారన్నారు.రికార్డు స్థాయిలో సురేష్ ప్రతి ఏటా బ్లడ్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 26న నిర్వహించే రక్తదానంలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్పొరేటర్ పి.వి.సురేష్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మల్కాపురం: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మల్కాపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు.. జనతాకాలనీలో ఉంటున్న అమర్‌నాథ్ (21) మత్తుకు బానిసై పలు దొంగతనాలు, గొడవలకు పాల్పడ్డాడు. అతను జనతాకాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అతను గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు మల్కాపురం సీఐ విద్యాసాగర్ తనిఖీ చేయగా అతని వద్ద 1.5 కిలోల గంజాయి లభించింది. దీంతో అతన్ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

శ్రీకృష్ణదేవరాయల చరిత్ర ఆదర్శనీయం

విశాఖ విద్య: శ్రీకృష్ణదేవరాయల పాలన నేటి పాలకులకు ఆదర్శప్రాయంగా నిలుస్తుందని ఈస్టర్న్ నేవల్ కమాండ్ కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు బత్తుల చిరంజీవి కొనియాడారు. కాకానినగర్‌లోని అసోసియేషన్ భవనంలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, కళలు, ఇలా ప్రతి ఒక్క రంగాన్ని రాయలు తనదైన శైలిలో శాశ్వతంగా నిలిపారన్నారు. అంతేకాకుండా సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి, తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు అనేక దేవాలయాలకు తన తల్లిదండ్రులు, భార్య, కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం ఎన్నో వజ్రాలు, పచ్చల పతకాలు అందజేశారన్నారు. సంఘం కార్యదర్శి విజనగరి భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.